క్లుప్తంగా

సన్మానం



ప్రధానోపాధ్యాయుడిని సన్మానిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు



గరుగుబిల్లి: గణపతిరావును సత్కరిస్తున్న సిబ్బంది

జియ్యమ్మవలస: మండలంలోని చినమేరంగి జేబీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.రంగయ్యను విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు మంగళవారం సన్మానించారు. ఇటీవల ఆయనకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు వచ్చిన నేపథ్యంలో సత్కరించినట్లు విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపారు. ప్రైవేటు పాఠశాలల మాదిరిగానే తమ పిల్లలకు హోమ్‌వర్క్‌లు ఇవ్వడం బాగుందన్నారు. ఇదే స్ఫూర్తితో విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు.

గరుగుబిల్లి: స్థానిక ఏరియా పశు వైద్యశాలలో సహాయ సంచాలకులుగా పనిచేసి, పదోన్నతిపై బదిలీ అయి వెళ్తున్న డాక్టర్ బి.గణపతిరావును మంగళవారం సన్మానించారు. అనంతరం ఆయన సేవలను పశు వైద్యాధికారి ఎస్.సురేష్‌కుమార్ ప్రశంసించారు. కార్యక్రమంలో సీతానగరం ఏడీ సీహెచ్ దీనకుమార్, జూనియర్ వెటర్నరీ అధికారి ఎం.శ్రీరామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

అభినందనలు



పరీక్షిత్‌రాజుకు అభినందనలు తెలిపి, సత్కరిస్తున్న ఎంపీపీ శ్యామల, జెడ్పీటీసీ లక్ష్మి తదితరులు

కొమరాడ/జియ్యమ్మవలస: వైఎస్సార్ సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడిగా రెండోసారి శత్రుచర్ల పరీక్షిత్‌రాజు ఎన్నికైన నేపథ్యంలో ఆయనకు అన్నివర్గాల నుంచి అభినందనల వెల్లువ వస్తోంది. కొమరాడ ఎంపీపీ శెట్టి శ్యామల, జెడ్పీటీసీ ద్వారపురెడ్డి లక్ష్మి, కన్వీనర్ ద్వారపురెడ్డి జనార్దనరావులు జియ్యమ్మవలస మండలంలోని చినమేరంగి కోటలో ఆయనను మంగళవారం కలిసి, అభినందనలు తెలిపారు. పుష్పగుచ్ఛం ఇచ్చి, దుశ్శాలువాతో సత్కరించారు. తనపై ఎంతో నమ్మకంతో పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ పదవి అప్పగించారని, అందరినీ సమన్వయం చేసుకుంటూ పార్టీ మరింత బలోపేతానికి కృషి చేస్తానని పరీక్షిత్ తెలిపారు. కార్యక్రమంలో కొమరాడ మండల పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సహాయ మలేరియా నివారణ అధికారి సూర్యనారాయణ

కొమరాడ: వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని సహాయ మలేరియా నివారణ అధికారి సూర్యనారాయణ సూచించారు. మండలంలోని మాదలింగి పీహెచ్‌సీ సిబ్బందితో మంగళవారం సమావేశమైన ఆయన.. పలు సూచనలు చేశారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉండేలా గ్రామస్తులకు అవగాహన కల్పించాలని, గ్రామాల్లో జ్వరపీడితులను గుర్తించి, వెంటనే వైద్యం అందేలా చూడాలని తెలిపారు. అలాగే గ్రామంలోని ప్రజలకు కూడా పరిసరాల పరిశుభ్రత పాటించాలని కోరారు. అనంతరం కెమిశీల గిరిజన సంక్షేమ పాఠశాలను సందర్శించి, అక్కడి విద్యార్థులకు చదువు, ఆరోగ్యంపై పలు సూచనలు చేశారు. క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించాలని, వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని తెలిపారు.

సేంద్రీయ వ్యవసాయంతో అధిక దిగుబడులు



క్షేత్ర సందర్శన చేస్తున్న అధికారులు

సీతంపేట: సేంద్రీయ వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధింధించవచ్చని వ్యవసాయ శాఖ ఏడీఏ రత్నకుమారి అన్నారు. మండలంలోని పొలం పిలుస్తోంది కార్యక్రమం కిల్లాడ, పొల్ల గ్రామాల్లో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయ తెగుళ్లు, నివారణా చర్యలు గూర్చి వివరించారు. రైతులు సాగులో అధికారులు సూచనలు, సలహాలు పాటించాలని తద్వారా అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. క్షేత్ర సందర్శన చేశారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

వెక్కిరిస్తున్న 'జల్ జీవన్' పనులు

- ఎక్కిడి పనులు అక్కడే..
- దిష్టిబొమ్మల్లా ట్యాప్‌లు

సీతంపేట:

సీతంపేట ఏజెన్సీలో జల్ జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి కుళాయి నీరు ఇప్పట్లో వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో సురక్షిత తాగునీరు గగనమౌతుంది. కేంద్ర ప్రభుత్వ నిధులు రూ.10 కోట్ల నిధులతో గతంలో చేపట్టిన పనులు ఎక్కడపడితే అక్కడే ఆగిపోయాయి. పూర్తి స్థాయిలో పనులు జరగలేదు. సీతంపేట ఏజెన్సీలో మొత్తం 25 గ్రామాలకు తాగునీరు అందించాలనే లక్ష్యంతో చేపట్టిన ఈ ప్రాజెక్టు పనులు మందకొడిగా సాగడంతో మారుమూల ప్రాంతాలకు ఎలాగు నీరు అందదు. కనీసం రోడ్డు పక్కన గ్రామాలకు సైతం నీరు అందివ్వని పరిస్థితి నెలకొంది. పులిపుట్టి నుంచి గొయిది వరకు ఉన్న గ్రామాల్లో ఇంటింటికి కుళాయి వేసి నీరు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ ఫలితం లేకపోయింది. ట్యాప్‌లు దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. కొన్ని గ్రామాల్లో గతంలో ఇచ్చిన సోలార్ రక్షిత పథకాలు సైతం పోవడంతో నీటికి ఇబ్బందులు తప్పడం లేదు. ఈ సీజన్‌లో కూడా తాగునీటికి ఇబ్బందులు పడుతూ కలుషిత నీరు తాగడంతో వ్యాధుల బారిన కూడా పడిన సందర్భాలున్నాయి.



మెట్టుగూడ వద్ద ఏర్పాటు చేసిన రక్షిత పథకం



వైటీసీ సమీపంలో నిర్లక్ష్యంగా వదిలేసిన నీటి కుండి



సీతంపేటలో దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్న ట్యాప్‌లు

సర్వే చేస్తున్నాం..

జల్ జీవన్ పనులపై ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఢిల్లేశ్వరరావు వద్ద ప్రస్తావించగా ప్రస్తుతానికి పనులు ఎక్కడ నిలిచిపోయాయో సర్వే జరుగుతోందని చెప్పారు. మళ్ల కొత్తగా టెండర్లు పిలిచి మిగిలిన పనులు చేపట్టడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

బడితోటలు అభివృద్ధి చేయాలి

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): అన్ని పాఠశాలల్లో బడితోటలు అభివృద్ధి చేయాలని కురుపాం ఎంఈవో ఎస్.సత్యనారాయణ సూచించారు. కురుపాం మండల కేంద్రంలోని మండల వనరుల కేంద్రం (ఎంఆర్‌సీ) వద్ద మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఆకుకూరలు, కూరగాయల మొక్కల విత్తనాల ప్యాకెట్లను మంగళవారం పంపిణీ చేశారు. పాఠశాలల ఆవరణల్లోని ఖాళీ ప్రదేశాల్లో కూరగాయలు, ఆకుకూరలు పెంచి, వాటిని విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం వంటకాల్లో వినియోగించాలని తెలిపారు.



కూరగాయల విత్తనాల ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న ఎంఈవో సత్యనారాయణ

గ్రావెల్‌తో పూడ్చారు..

- సాక్షి ఎఫెక్ట్

భామిని: మండలంలోని అనంతగిరి – దిమ్మిడిజోల మధ్య గల వంశధార వరద కాలువపై గల వంతెన వద్ద పొంచి ఉన్న ప్రమాదంపై వంశధార ఇంజినీర్లు మంగళవారం స్పందించారు. సాక్షిలో సోమవారం ప్రచురితమైన పొంచి ఉన్న ప్రమాదం కథనంపై వారు స్పందించి వరద కాలువ బ్రిడ్జికు రెండువైపులా ఎప్రోచ్ కాంక్రీట్ ఊడిపడిన గజాలను గ్రావెల్‌తో కప్పేశారు. పాదచారులకు, వాహన చోదకులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టారు. వంశధార డీఈఈ భవానీశంకర్, ఏఈ సునీతాకిరణ్ పర్యవేక్షణలో తాత్కాలిక పరిష్కారం చూపారు.

హడలెత్తిస్తున్న ట్రాఫిక్



పాలకొండ - విశాఖ రహదారిలో వాహనాల రద్దీ

పాలకొండ రూరల్: డివిజన్ కేంద్రం పాలకొండలో వాహనాల సంఖ్య రోజురోజుకు పెరుగుతుంది. ఇతర జిల్లాల నుంచి భారీ వాహనాల రాకపోకలు అధికమయ్యేవి. ఈ క్రమంలో పట్టణంలో పాలకొండ – శ్రీకాకుళం, విశాఖ, పార్వతీపురం రహదారుల్లో ట్రాఫిక్ విపరీతంగా పెరిగింది. రోడ్డుకు ఇరువైపులా చిరు వ్యాపారులు కొంత మేర దుకాణాలు, తోపుడు బళ్లు ఏర్పాటు చేస్తుండడంతో సమస్య మరింత జఠిలం చేస్తున్నాయి. పైగా పండగల సీజన్ కావటంలో రద్దీ మరింతగా పెరిగింది. ఈ నేపథ్యంలో పోలీసులు అవసరమైన చర్యలతో పాటు ట్రాఫిక్ నియంత్రణకు తగు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఐదేళ్లలో అభివృద్ధి చూపాలి



సమావేశంలో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి సత్యంనాయుడు

భామిని:

స్వర్ణాంధ్రప్రదేశ్ సాధనలో భాగంగా ఐదేళ్లలో శతశాతం అభివృద్ధి సాధించే దిశగా అధికారులు పని చేయాలని పార్వతీపురం మన్యం జిల్లా డీఆర్‌డీఏ పీడీ, మండల ప్రత్యేకాధికారి వై.సత్యంనాయుడు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ జి.చంద్రరావు, తహసీల్దార్ నిమ్మల శేఖరం ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీ ఏడాది 15 శాతం అభివృద్ధి సాధించే విధంగా ప్రగతి సాధించాలన్నారు. ప్రధానంగా ప్రభుత్వ గృహాల నిర్మాణాలు వేగవంతం చేయాలని, లేఔట్లు వద్ద సౌకర్యాలు కల్పించాలన్నారు. పనులు వేగవంతం చేసి బిల్లులు చెల్లింపులు చేపట్టాలన్నారు. అనంతరం భామినిలో ప్రభుత్వ గృహాల నిర్మాణ లేఔట్‌ను ప్రత్యేకాధికారి సత్యంనాయుడు పరిశీలించారు. తక్షణమే పూర్తి చేయడానికి అవసరమైన విద్యుత్తు, నీటి వసతి కల్పించాల్సి ఉందని హౌసింగ్ ఏఈ చంద్రశేఖరరావు వివరించారు. విద్యుత్తు సరఫరాకు అవసరమైన చర్యలకు ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాసరావుకు ఆదేశించారు. సచివాలయ ఉద్యోగులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

తెగుళ్లు సోకకుండా పంటలు కాపాడుకోవాలి

గుమ్మలక్ష్మీపురం:

పంటలకు తెగుళ్లు సోకకుండా కాపాడుకోవాలని రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు ఎస్.శ్రీనివాసరాజు, ఎం.అనంతవిహారి తెలిపారు. మండలంలోని చినవంకధార, వనకాబడి గ్రామాల్లో కురుపాం ఏడీఏ నిర్మల జ్యోతి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఆయా గ్రామాల్లోని వరి, జీడిమామిడి, కంది, రాగి పంటలను పరిశీలించి, పలు సూచనలు చేశారు. పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలని, అధిక దిగుబడులు, ఆరోగ్యవంతమైన పంటకు వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తల సలహాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సీహెచ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ: మండలంలోని విక్రంపురం, ఆర్తాం తదితర గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి పి.శంకరరావు మాట్లాడుతూ వరి, పత్తి పంటలను దోమ ఆశించే అవకాశం ఉన్నందున తగిన జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. మోతాదుకు మించి రసాయనిక ఎరువులు వాడవద్దన్నారు. వీలైనంత వరకు ప్రకృతి వ్యవసాయ విధానాలు అవలంబించాలని, సేంద్రియ ఎరువుల వినియోగానికి ప్రాధాన్యమివ్వాలన్నారు.

కలుపు నివారణపై దృష్టి సారించాలి

వీరఘట్టం: వరి సాగుకు ప్రస్తుతం వాతావరణం అనుకూలంగా ఉందని, పంటలు ఏపుగా పెరుగుతున్నందున కలుపు కూడా ఉంటుందని, పంట పొలంలో ఉండే కలుపు నివారణపై రైతులు దృష్టి సారించాలని ఏఓ జక్కువ సౌజన్య సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా కత్తులకవిటి గ్రామంలో అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ప్రస్తుతం పంట పొలుకారే దశలో ఉందని, రసాయన మందులు ఎక్కువగా వాడొద్దని సూచించారు. చీడపీడలు ఉంటే వెంటనే సచివాలయంలో అందుబాటులో ఉండే వీఏఏలకు సమాచారం ఇవ్వాలని, వారు సూచించిన విధంగా నివారణ చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖ ఏఓ అమరేశ్వరి, టీడీపీ నాయకులు నిమ్మక పాండురంగ పాల్గొన్నారు.

పాలకొండ రూరల్: అధిక దిగుబడులు సాధించేందుకు రైతులు అధికారుల సలహాలను పాటించాలని ఎంపీపీ బొమ్మాళి సుధాభాను అన్నారు. అరదలి గ్రామంలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తుంది కార్యక్రమానికి ఎంపీపీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏఓ వాహిని ప్రస్తుత వర్షాల తీవ్రతను అధిగమించి పంటలను రక్షించే సూచనలు అందించారు. రానున్న రబీలో వేయదలచిన పంటలకు సంబంధించి ఇప్పటి నుంచి విత్తన సేకరణ, భూమిలో పోషక విలువల నిర్ధారణ పరీక్షల ఆవశ్యకత, ఎరువుల వాడకం, ఈ–పంటలు, ప్రోక్యూర్మెంట్ విధానాలపై అవగాహన కలిపించారు. కార్యక్రమంలో నల్లి శివప్రసాద్, కోడిశ్రీహరి, లాస గణపతి, సుధాకర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై ఇంజిన్లు ఇవ్వాలి

భామిని: రైతులకు అవసరమైన ఆయిల్ ఇంజిన్లు, టార్పాలిన్లు, యంత్ర పరికరాలు రాయితీపై ఇప్పించాలని బాలేరు, ఘనసర రైతులు కోరారు. ఏఓ కె.సింహాచలం ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ముందుగా బాలేరు రైతు సేవా కేంద్రంలో పొలం పిలుస్తోంది కార్యక్రమ పోస్టర్ ఆవిష్కరించారు. సర్పంచ్ జామి ప్రభాకర్, ఎంపీటీసీ కొత్తకోట చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ పడాల కొండయ్య, వ్యవసాయ సహాయకులు జ్యోతి, ఎలీసా, ఆదినారాయణ, పలువురు రైతులు పాల్గొన్నారు.



గుమ్మలక్ష్మీపురం: చినవంకధార పొలాల్లో అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు



కొమరాడ: ఆర్తాంలో పత్తి చేనులో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు



పొలం పిలుస్తోందిలో రైతులకు సూచనలిస్తున్న ఏఓ సౌజన్య



పాలకొండ రూరల్: అరదలి గ్రామంలో పొలం పిలుస్తోందిలో ప్రజా ప్రతినిధులు, అధికారులు



భామిని: పొలం పిలుస్తోంది పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ..



గరుగుబిల్లి: వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏవో విజయభారతి

గరుగుబిల్లి: మండలంలోని తోటపల్లి, సంతోషపురం, గిజబ, సుంకి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో ఆర్.విజయభారతి వరి పంటను ఆశించే తెగుళ్ల నివారణకు పలు సూచనలు చేశారు. రసాయనిక ఎరువులకు బదులుగా సేంద్రియ ఎరువులను వినియోగించాలని సూచించారు. అనంతరం పొలం పిలుస్తోంది కార్యక్రమ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు ఎ.సింహాచలమమ్మ, ఎ.తవిటినాయుడు, ఎం.భాగ్యలక్ష్మి, కె.రవీంద్ర, ఎంపీటీసీ ఎం.సింహాచలంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆ మస్టారును.. చిట్టిపులివలసలోనే ఉంచండి

- ఎంఈఓకు విన్నవించిన విద్యార్థుల తల్లిదండ్రులు

వీరఘట్టం: పాఠశాలల్లో ఉపాధ్యాయుల సర్దుబాటులో భాగంగా పది రోజుల క్రితం తమ గ్రామ పాఠశాల నుండి నడుకూరు పాఠశాలకు బదిలీ చేసిన సాకేటి రాంబాబు మాస్టారును మరలా తమ గ్రామ పాఠశాలకు పంపించాలని చిట్టపులివలస గ్రామస్తులు కోరారు. ఈ మేరకు మంగళవారం ఎంఈఓ డి.గౌరినాయుడిని కలసి తమ సమస్యలను వివరించి వినతిపత్రం ఇచ్చారు. విద్యాశాఖ ఇటీవల ఉపాధ్యాయులకు చేపట్టిన వర్క్ అడ్జస్టమెంట్‌లో భాగంగా మండలంలోని చిట్టపులివలస ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు సాకేటి రాంబాబును నడుకూరు యూపీ పాఠశాలకు బదిలీ చేశారు. అయితే రాంబాబు మాస్టారు స్కూల్ నుండి వెళ్లిన తర్వాత తమ పిల్లల చదువులు బాగాలేవని, అతను ప్రతీ రోజు ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు మా పిల్లలకు పాఠాలు చెబుతూ మా అందరిలో ఒక్కరిగా కలసి పోయారని తెలిపారు. ఆయన బదిలీపై వెళ్లిన గత పది రోజులుగా పిల్లలు సక్రమంగా చదవడం లేదని, రాంబాబు మాస్టారు కావాలని విద్యార్థులు కోరుతున్నారని తెలిపారు. దీంతో విద్యార్థుల బాధను చూడలేక వారి తల్లిదండ్రులు ఎంఈఓను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ విషయాన్ని జిల్లా విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతానని ఎంఈఓ హామీ ఇచ్చారు.



ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న చిట్టపులివలస గ్రామస్తులు

పారిశుద్ధ్యంపై అవగాహన

పాలకొండ: పారిశుద్ధ్యంపై అవగాహన పెంచుకోవాలని నగర పంచాయతీ కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు అన్నారు. పట్టణంలో స్వచ్ఛత హి సేవ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. పట్టణంలోని రామకళా మందిరం సచివాలయం పరిధిలో ఇంటింటికీ ప్రచారం చేశారు. చెత్తను తడి, పొడిగా వేరు చేసి తమ వీధుల్లోకి వచ్చే పారిశుద్ధ్య కార్మికులకు అప్పగించాలని సూచించారు. కాలువల్లో చెత్తను వేయొద్దని కోరారు. అనంతరం సచివాలయ సిబ్బంది, మెప్మా సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు.



పాలకొండలో స్వచ్ఛత హి సేవ ర్యాలీలో పాల్గొన్న కమిషనర్ తదితరులు

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి

గరుగుబిల్లి: గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి ఒ.ప్రభాకరరావు సూచించారు. మండల కేంద్రంలోని గృహ నిర్మాణ శాఖ కార్యాలయంలో మన ఇల్లు–మన గౌరవం కార్యక్రమంపై మంగళవారం సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో గృహ నిర్మాణాలు పూర్తి చేసేలా ఈ నెల 28వ తేదీన లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. ఫిబ్రవరి నెలాఖరులోగా నిర్మాణాలు పూర్తి చేయకపోతే ఇళ్లు రద్దు చేస్తామన్నారు. గృహ నిర్మాణానికి రూ.1.80 లక్షలతో పాటు స్వయం సహాయక సంఘాల ద్వారా మరో రూ.30 వేల రుణం మంజూరు చేయడం జరుగుతుందన్నారు. మండలానికి సంబంధించి, సొంత స్థలంలో 254 మందికి, లేఅవుట్లలో 242 మందికి ఇళ్లు మంజూరయ్యాయన్నారు. ప్రస్తుతం వాటిలో 168 నిర్మాణాలు పూర్తయ్యాయని, లేఅవుట్లలో తాగునీరు, విద్యుత్ తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జి.పైడితల్లి, హౌసింగ్ ఏఈ వి.అఖిల్, విద్యుత్ శాఖ ఏఈ బి.శంకరరావు తదితరులు పాల్గొన్నారు.



గృహ నిర్మాణాలపై సమీక్షిస్తున్న మండల ప్రత్యేకాధికారి ప్రభాకరరావు

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం

గరుగుబిల్లి: బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని ఎస్ఐ పి.రమేష్‌నాయుడు హెచ్చరించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పలు చట్టాలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో సైబర్‌మోసాలు, లైంగికదాడులు, హత్యాయత్నాలు పెరిగిపోతున్నాయని, అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అనుమానాస్పదంగా ప్రవర్తించినా, అపరిచిత వ్యక్తులు దాడులకు యత్నించినా వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ 100కు ఫోన్ చేయాలని సూచించారు. అలాగే స్మార్ట్‌ఫోన్లకు వచ్చే అనవసర ఫోన్‌కాల్స్‌కు స్పందించవద్దన్నారు. ఓటీపీ(వన్‌టైమ్ పాస్‌వర్డ్)లను ఎవరికీ చెప్పవద్దన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎస్.ఎల్.ఎన్.పాత్రుడు, కానిస్టేబుల్ ఉమామహేశ్వరరావు, మహిళా పోలీస్ భవాని పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రమేష్‌నాయుడు

సేవాగుణం అలవర్చుకోవాలి..

పాలకొండ రూరల్: ప్రతి విద్యార్థి సేవా గుణం అలవర్చుకోవాలని స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వి.హరగోపాల్ అన్నారు. ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ పీఓ వెలమల అప్పారావు మాట్లాడుతూ గాంధీజీ శత జయంతి వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో మంచి నడవడిక అలవాటు అవుతుందన్నారు. ప్రతి విద్యార్థి జాతీయ సేవా పథకంలో భాగస్వాములై తమ వంతుగా సమాజానికి సేవ అందించాలన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎం.శ్యామ్‌బాబు నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రతినిధులు బి.రాజు తదితరులు పాల్గొన్నారు.



ఎన్ఎస్ఎస్ విశిష్టతను వివరిస్తున్న అధ్యాపకులు అప్పారావు తదితరులు

కనీస వసతుల్లేక అవస్థలు

పాలకొండ రూరల్: పట్టణంలో పలు కాలనీల్లో కనీస వసతులు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా రహదారులు, తాగునీరు, వీధి దీపాలు, డ్రైనేజీలు లేక గారమ్మ కాలనీ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ కాలనీలో వీధి కాలువ, రహదారులు లేకపోవడంతో ఇటీవల కురిసిన వర్షాలకు నీరు నిల్వ ఉండి కంపు కొడుతోంది. దీంతో దోమలు చేరి ప్రజలు ఆందోళన చెందుతున్నారు. స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలోనైనా తమ కాలనీలో మురుగును తొలగించి పరిశుభ్ర వాతావరణం నెలకొనేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



గారమ్మ కాలనీ వీధుల్లో నిలిచిపోయిన వర్షపు నీరు

సర్పంచ్ మృతికి సంతాపం

పాలకొండ రూరల్: మండలంలోని దుగ్గి గ్రామ సర్పంచ్ మజ్జి వెంకటమ్మ (83)మంగళవారం ఉదయం స్వగృహంలో అనారోగ్యంతో మరణించారు. మూడు దఫాలు సర్పంచ్‌గా ఆమె చేసిన సేవలను సహచర ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు గుర్తు చేసుకున్నారు. ఈమె భర్త దాలి అప్పారావునాయుడు కూడా దుగ్గి సర్పంచ్‌గా చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈమెకు ఓ కుమారుడు ఉన్నారు. వెంకటమ్మ మరణం పట్ల రాజకీయాలకు అతీతంగా పలువురు నాయకులు, ప్రజా ప్రతినిధులు తమ ప్రగాఢ సానుభూతిని ఆ కుటుంబ సభ్యులకు తెలిపారు.



మజ్జి వెంకటమ్మ (ఫైల్)